సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సబ్ జైలును 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ముద్దాయిలతో మాట్లాడి వారి యోగ, క్షేమాలతోపాటు, వారికి అందజేస్తున్న భోజనం, మంచినీరు, ఇతర వసతి సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీరమణి, డిఎస్‌పి శ్రీహరిరాజు, సబ్ జైలు సూపరింటెండెంట్ రమణబాబు, న్యాయవాది కె.ప్రభూజి, వాలంటీర్ కె.జ్యోతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ తప్పిన వస్త్ర దుకాణాలు

-నేటికీ ఊపందుకోని వ్యాపారం
-తగ్గిన కొనుగోళ్లు..ఆందోళనలో వ్యాపారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఏటా క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి సీజన్లలో పది రోజులు ముందు నుంచే బట్టల వ్యాపారం జోరందుకునేది. రోజుకి రూ.2 నుంచి రెండున్నర లక్షల వరకూ ఒక్కో దుకాణంలో వ్యాపారం సాగేది. గతేడాది మాదిరిగానే ఈ సంవత్సరం రూ.30 నుంచి రూ.40 వేలు మించి వ్యాపారం సాగడం లేదని కాకినాడ మెయిన్ రోడ్డులోని ఒక వస్త్ర వ్యాపారి తెలిపారు.

పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, పెట్రోలు, గ్యాస్ ధరలతో ఖర్చులు భారీగా పెరిగాయి. స్కూల్ పిల్లల ఫీజులు, ఇంటి అద్దెలు కట్టలేక పోతున్నాం. ఆస్పత్రి ఫీజులు చెల్లించలేక అవస్థలు పడుతున్నాం. దీంతో కొత్త బట్టల కొనుగోలుకు స్తోమత సరిపోక ఈసారి పండక్కి బట్టలు కొనుగోలు చేయలేకపోతున్నామని పలువురు సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో దాదాపు 500 వరకూ వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా రెడీమేడ్ షాపుల సంఖ్య మరో 400 పైనే ఉంటాయి. కాకినాడ, ఉప్పాడ, పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట పట్టణాలతోపాటు కొన్ని మండల కేంద్రాల్లోనూ పెద్ద పెద్ద షాపులు, కార్పొరేట్ సంస్థల రెడీమేడ్ బ్రాంచిలు ఉన్నాయి. వస్త్ర వ్యాపారానికి కాకినాడ పెట్టింది పేరు. ఇక్కడే ఏటా రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. ఇటీవల కాలంలో కార్పొరేట్ సంస్థలకు చెందిన పెద్దపెద్ద వ్యాపార సంస్థలు సైతం తమ తమ బ్రాంచీలను ప్రారంభించాయి. దుకాణాల ప్రారంభోత్సవం సందర్భంగా సెలబ్రిటీలను తీసుకువచ్చి భారీ ఆఫర్లతో బట్టలు అమ్మకాలను ప్రారంభించారు. దీంతో కాకినాడ నగరం జనాలతో కిటకిటలాడింది. అయితే కొద్ది రోజులు మాత్రమే ఆఫర్లు ఉన్నందున వీరి వ్యాపారాలు ముందుకు సాగాయి. అయితే క్రిస్మస్‌లో అనుకున్నంత స్థాయిలో వ్యాపారం జరగలేదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా మామూలు రోజుల్లో అన్ని దుకాణాల్లో రోజుకు రూ.కోటి నుంచి రూ. 2 కోట్ల వరకూ వ్యాపారం జరిగేది. మాములు పండుగల సీజన్లలో రూ.3 కోట్ల వరకు ఉంటుంది. సంక్రాంతిలో అయితే రూ.5 కోట్లు పైనే ఉండేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

ఉప్పాడలో వెలవెలబోతున్న వస్త్ర దుకాణం

పండగ అంటేనే వస్త్ర వ్యాపారం

సంక్రాంతి మరో రెండు వారాలు గడువు మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో 15 రోజులు ముందు నుంచే పలువురు బట్టలను కొనుగోలు చేసుకుంటారు. సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే బట్టల అమ్మకాలు ఊపందుకోవాల్సి ఉంది. కానీ అనుకున్నంత స్థాయిలో వ్యాపారాలు జరగడంలేదని పలువురు చెబుతున్నారు. ఇటీవల తుపాన్ నేపథ్యంలో రైతులు బాగా నష్టపోయారు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితుల్లో సొమ్ములు చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి రైతుల్లో నెలకుంది. మరోవైపు నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు లేక ఎదురుచూపులు చూస్తున్నారు. ఇంకోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం పడకేసింది. వ్యవసాయ పనులు పూర్తిస్థాయిలో దొరకడం లేదు. ఆదుకుంటుంది అనుకుంటున్న ఉపాధి హామీ చట్టం పనులను అధికారులు సక్రమంగా చెప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టానికి పేరు మార్చి నిర్వీర్యం చేసే కుట్రలు పన్నింది. దీంతో పనులు లభించక గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు అల్లాడుతున్నారు.

వెలవెలబోతున్న దుకాణాలు

గతంలో సంక్రాంతికి పది, పదిహేను రోజులు ముందుగానే పలు వస్త్ర దుకాణాలు కళకళలాడేవి. కానీ గత మూడు, నాలుగేళ్లుగా పలు దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఉప్పాడలోని జాంధాని పట్టుచీరలు కొనుగోలు చేసేందుకు నిత్యం వందలాదిమంది రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. పండగ నెల రోజుల ముందు నుంచే ఇక్కడ వ్యాపారం గట్టిగా జరుగుతుంది. అయితే సంక్రాంతి సమీపిస్తున్న తరుణంలో అరకొర బిజినెస్ తప్ప అంతగా వ్యాపారం ఉండడం లేదని ఉప్పాడలోని చేనేత వస్త్ర దుకాణాల యజమానులు పలువురు వాపోతున్నారు. పండగ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇప్పటికే కొనుగోళ్లు పుంజుకోవాల్సివుంది.

వ్యాపారాలు జరగడం లేదు

జాంధాని చీరల కోసం నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చేవారు. అయితే గత మూడు సంవత్సరాలుగా వ్యాపారాలు సక్రమంగా జరగడం లేదు. ఈసారి సంక్రాంతి సీజన్‌లో వ్యాపారం జరుగుతుందని ఆశించాము. కానీ కొనుగోలుదారులు అంతగా షాపులకు రావడం లేదు.

-సూరాడ భవాని, బట్టల వ్యాపారి, ఉప్పాడ

దెబ్బతీస్తున్న ఆన్‌లైన్ వ్యాపారం

ప్రస్తుతం ప్రజల చేతిలో సొమ్ములు ఉండటం లేదు. దీనికి తోడు మారుతున్న కాలానికి అనుగుణంగా వస్త్ర వ్యాపారం అంతగా జరగడం లేదు. ఆన్‌లైన్ బిజినెస్ ఎక్కువగా ఉంది. కార్పొరేట్ సంస్థలకు చెందిన వివిధ వ్యాపార సంస్థలు భారీ ఆఫర్లతో జనాలను ఆకర్షిస్తున్నాయి. దీంతో మాలాంటి దుకాణాలకు కొనుగోలుదారులు రావడం లేదు.

-ఎస్.సత్యనారాయణ, చీరల వ్యాపారి, యు.కొత్తపల్లి

నగరంలో సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

సిఐటియు ఆధ్వర్యాన బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ

సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ నగర సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం నగరంలోని భానుగుడి సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జగన్నాథపురం వంతెన నుంచి దేవాలయం మీదుగా కలెక్టరేట్ వరకూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎపి ఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకట్రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.పద్మ మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో మొదటిసారిగా సిఐటియు అఖిలభారత మహాసభ విశాఖపట్టంలో నేటి నుంచి జనవరి 4వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. ఈ మహాసభ ముగింపు సందర్భంగా జనవరి 4న జరిగే ప్రదర్శన, బహిరంగ సభలను కార్మికులు, ప్రజలు, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు పాల్గొని జయప్రేదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మికులకు వ్యతిరేకమైన నిర్ణయాలు చేసే ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని, కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చి యజమానులకు, పెట్టుబడిదారులకు అనుకూలమైన నిర్ణయాలు చేస్తున్న ప్రభుత్వాల విధానాలను తిప్పి కొట్టాలన్నారు. లేబర్ కోడ్స్‌ను వెనక్కు తీసుకునే కార్మిక వర్గం పోరాటాలను సాగించాలని అన్నారు. పోరాటాల వేగుచుక్క సిఐటియు అఖిలభారత మహాసభలో భవిష్యత్తులో చేయబోయే పోరాటాలకు ఒక దిశా నిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ 2026 ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేయడానికి కార్మికులంతా సిద్ధపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు, ఎపి ఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కోశాధికారి డి.ప్రసాద్, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, నగర కమిటీ సభ్యులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, భారతీప్రియ, జి.రమణమ్మ, ఎన్.సూర్యనారాయణ, హరినాథ్, అప్పారావు, రాణి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం లేని వేడుకలు చేసుకుందాం...

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మద్యం, మాదకద్రవ్యాలు లేకుండా నూతన సంవత్సరానికి స్వాగతం చెబుదామని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో జన విజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మద్యం, ఇతర మాదకద్రవ్యాలు వద్దు నాన్నలు, అన్నయ్యలు అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా ప్రభుత్వం ఆలోచించకుండా ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, నేడు, రేపు మద్యం షాపులను మూసివేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అడపా వెంకటరావు, అధ్యాపకులు కెవి.సర్వేశ్వరరావు, జి.విశ్వ వీరస్వామి, జి.విజయ్ కుమార్, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఏలేటి నానిబాబు, టి.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

ప్రజాశక్తి డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజాశక్తి ప్రచురించిన క్యాలెండర్‌లను కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్ మంగళవారం వేరువేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రతి సంవత్సరం డైరీ, క్యాలెండర్లను ప్రచురించడం ఆనందదాయకంగా ఉందన్నారు. సంవత్సరం పొడుగునా తేదీలు పెద్దవిగా కనపడే విధంగా ప్రత్యేకంగా ప్రజాశక్తి క్యాలెండర్లను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి ఎస్.శ్రీనివాసరావు, పెద్దాపురం డిఎస్‌పి డి. శ్రీహరిరాజు, తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ ముమ్మిడి లక్ష్మణ్, కాకినాడ సిటీ రిపోర్టర్ జి.చిరంజీవి, సిబ్బంది సురేష్, మంజన్, శ్రీహరి పాల్గొన్నారు.

క్యాలెండర్‌నుఆవిష్కరిస్తున్న ఎస్‌పి బిందుమాధవ్ తదితరులు

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం

-నూతన సంవత్సర వేడుకలో హద్దు మీరితే చర్యలే -ఎస్‌పి బిందు మాధవ్ హెచ్చరిక

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్‌పి జి.బిందుమాధవ్ అన్నారు. చెప్పారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 2025 సంవత్సరానికి సంబంధించి వార్షిక నివేదికను విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. 2025లో కొంత శాతం నేరాలు తగ్గడానికి వివిధ రూపాల్లో పోలీసులు చేసిన కృషి ఫలించిందని అన్నారు. 2026 నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నెరవేర్చుకోవాలని అన్నారు. డిసెంబర్ 31వ తేదీ బుధవారం రాత్రి మద్యం తాగి వాహనాల ద్వారా శబ్ద కాలుష్యం నిర్వహించి రోడ్లపై తిరిగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గత సంవత్సరం కన్నా 2025లో నేరాల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ఆస్తి నేరాలు 738 జరగా ప్రస్తుతం వేయి నమోదుతో 35.50 శాతం పెరిగాయన్నారు. వీటి రికవరీలో ముందంజలో ఉన్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు రౌడీషీటర్లు, దొంగతనాలు చేసే వారిపై దృష్టి సారించి 229 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. గత సంవత్సరం 105 మందిపై కేసు నమోదు చేయగా ప్రస్తుత ఏడాదిలో వారి పట్ల అప్రమత్తంగా దృష్టి సారించారని తెలిపారు. అపహరణకు గురైన బంగారం, వెండి, ఇతర వస్తువుల రికవరీలో పురోగతి సాధించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం 5.215 గ్రాములు బంగారం, 92. 401 గ్రాముల సిల్వర్ రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు చెప్పారు. అలాగే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు గత ఏడాది 65 నమోదు కాగా ప్రస్తుతం 46 కేసులు మాత్రమే నమోదు అయ్యాయన్నారు. ముఖ్యంగా సైబర్ క్రైంలో సుమారు రూ.14 కోట్ల వరకు కోల్పోగా తక్షణం ఫిర్యాదు చేయడంలో బాధితుల ముందుకు రాకపోవడంతో రికవరీ చేయడం కష్టమైందని తెలిపారు. సైబర్ క్రైంలో భాగంగా జాతీయ బ్యాంకులు అయితే రికవరీకి ఎక్కువ అవకాశమని అదే విదేశీ బ్యాంక్ అయితే రికవరీ కష్టమవుతుందన్నారు. నిజానికి సైబర్ నేరాల నియంత్రణలో మెరుగు కనబరిచిన సిబ్బందిని ఆయన అభినందించారు. గతంలో 2715 నేరాలు జరగా, ప్రస్తుత ఏడాదిలో 1739 నేరాలు మాత్రమే జరిగాయన్నారు. బాధితులకు రూ.95.24 లక్షలను రికవరీ చేసినట్లు తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టమన్నారు. గుడ్ టచ్ బి బ్యాడ్ టచ్ పైన 1676 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. గత సంవత్సరం అత్యాచార కేసులు 19 నమోదు కాగా ప్రస్తుత సంవత్సరం 10 మాత్రమే నమోదయ్యన్నారు. అలాగే వరకట్నం వేధింపులు తగ్గాయని వివరించారు. ఆస్తి సంబంధిత నేరాల్లో గత సంవత్సర 57 శాతం నమోదు కాగా రికవరీ 62 శాతానికి పెరిగిందని, వాటి విలువ రూ.5.60 కోట్ల వరకూ ఉందన్నారు. రోడ్డు ప్రమాద భద్రత గతం కన్నా 22 శాతం తగ్గిందని తెలిపారు. ముఖ్యంగా టెక్నాలజీతో నేర నియంత్రణ గణనీయంగా పర్యవేక్షించడం జరుగుతుందని, ప్రతి నిత్యం 18 డ్రోన్లతో నిఘా, 4418 పైగా సిసి కెమెరాలు, బాడీ బార్న్ కెమెరాలతో పరివేక్షణ, స్మార్ట్ పార్కింగ్ అలర్ట్ సిస్టం అమలు తదితర అంశాల్లో జిల్లా పోలీసులు నేర, అసాంఘిక చర్యలు జరగకుండా పర్యవేక్షించడంలో ముందంజలో ఉన్నారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి ఎస్.శ్రీనివాసరావు, డిఎస్‌పి మనీష్ దేవరాజ్‌పాటిల్, పెద్దాపురం డిఎస్‌పి డి.శ్రీహరిరావు, సిఐలు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి బిందుమాధవ్

ఐడి కార్డుల అందజేత

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని ఫకురుద్దీన్ పాలెం ఎంపి యుపి పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి బావిశెట్టి లక్ష్మీనారాయణ ఐడి కార్డులతోపాటు, పుస్తకాలు, పున్నులు బహుకరించారు. మంగళ వారం జరిగిన ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండలం తామరాడలో ఉపాధ్యాయుడు, ఫకురుద్దీన్‌పాలెం పూర్వ విద్యార్థి లక్ష్మీనారాయణ 120 మంది విద్యార్థులకు ఐడి కార్డ్స్‌ను ఎంఇఒ జి.శ్యాంబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తను చదివిన పాఠశాలను మరచిపోకుండా విద్యార్థుల అవసరార్థం ఐడి కార్డ్స్, పుస్తకాలు, పెన్నులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎన్.నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సూక్ష్మ జీవశాస్త్రంలో పరిశోధనలు అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

సూక్ష్మ జీవశాస్త్రంలో మరిన్ని పరిశోదనలు జరగాల్సిన అవసరం ఉందని ఆదిత్య డిగ్రీ, పిజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు అన్నారు. గత నాలుగు రోజులుగా ఆదిత్య డిగ్రీ కళాశాల సూక్ష్మజీవ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు, వ్యాసరచన, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, పోస్ట్ ప్రెజెంటేషన్ వంటి అంశాలలో పోటీలను నిర్వహించారు. మంగళవారం ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వైద్యరంగంలో సూక్ష్మజీవ శాస్త్రం యొక్క ప్రాధాన్యత చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మైక్రో బయాలజీ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు వి.అనిల్, డి.మాధవిరత్నప్రియ, సుభాషిణి విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న అకడమిక్ డైరెక్టర్ నాయుడు

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

విద్యార్థులకు తల్లితండ్రులు బలమైన పౌష్టికాహారాన్ని అందించాలని రాజపూడి పిహెచ్‌సి వైద్యులు ఎన్.పూజ సూచించారు. మంగళవారం స్థానిక శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థల ఆవరణంలో ఛైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వైద్య, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అందించాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. విద్యా సంస్థల ఛైర్మన్ నాగబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యా సంస్థల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, వైద్య సిబ్బంది, కాలేజ్ ప్రిన్సిపల్ కె.అభి, హై స్కూల్ ప్రిన్సిపల్ అడపా సాయిదీప్తి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ టి.నాగలక్ష్మీ, ఇన్‌ఛార్జ్ కొల్లా శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్‌ను సత్కరిస్తున్న విద్యా సంస్థ ఛైర్మన్

కార్టూ'నిజం'



ఎన్నికల హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

సూర్య బలిజ కులస్తులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రాష్ట్రీయ సూర్య బలిజ కులస్తుల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక సూర్య బలిజ సంఘ కార్యాలయంలో ఆత్మీయ సంఘ సమావేశం జరిగింది. సంఘ నాయకులు జివికె.రామ్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూర్య బలిజ కులస్తుల కుల గణన నమోదు కోసం పైడిముక్కల ఆనంద్ రూపొందించిన వెబ్‌సైట్‌ను ఉమ్మడి తూర్పు జిల్లాల సూర్య బలిజ సంఘ అధ్యక్షులు, కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏలూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సూర్య బలిజ కులస్తుల సమగ్ర కుల గణన నమోదు కోసం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు తెలిపారు. అలాగే జస్టిస్ రఘునాథరావు వన్ మ్యాన్ కమిషన్ సిఫార్సులను రాష్ట్ర కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూర్య బలిజ కులస్తులందరూ www.raastrasuryabalija.com వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ అధికార ప్రతినిధి కాలే వెంకటరత్నం, యండమూరి ఈశ్వరరావు, అల్లూ భాస్కరరావు, కాకరపల్లి శ్రీధర్, బి.కామేశ్వరరావు, కాలే సతీష్‌ప్రసాద్, పెండ్యాల ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న సంఘం నాయకులు

సత్యదేవుని ఊరేగింపులో కోలాటం చేస్తున్న కళాకారులు

ముక్కోటి ఏకాదశికి రూ.33 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - శంఖవరం

ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని మంగళవారం ఒక్కరోజే అన్నవరం సత్యదేవునికి రూ.33 లక్షల ఆదాయం లభించింది. మంగళవారం వేగువ చాము నుంచే యాత్రికులు అధిక సంఖ్యలో కొండపై రావడంతో అన్ని వ్రత మండపాలు నిండిపోయాయి. దర్శనం క్యూ లైన్ ద్వారా స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయానికి వచ్చిన యాత్రికులకు ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా కోలాటాలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యాత్రికుల రద్దీకి అనుగుణంగా ఇఒ వేండ్రా త్రినాథరావు, ఛైర్మన్ ఐవి.రోహిత్ క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎక్కడ ఎటు వంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా'

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని లంపకలోవ గ్రామానికి చెందిన మండల కోఆప్షన్ సభ్యులు గంటా చంటిబాబు ఇటీవల అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మంగళవారం ఆయనను ఎంఎల్‌ఎ పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గొంతిన సురేష్, యాళ్ల జగదీష్, వనపర్తి నాగేశ్వరరావు, లొండా లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

చంటిబాబును పరామర్శిస్తున్న సత్యప్రభ

నేడు సామర్లకోట కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు సకాలంలో హజరు కావాలని కోరారు. గత రెండు నెలలుగా ఛైర్‌పర్సన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టడం, అమలు కాకపోవడం వంటి అంశాలు నేపథ్యంలో వైసిపి కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో వరుసగా సమావేశాలు వాయిదా పడుతున్నాయి. వరుసగా మూడు సమావేశాలు జరగకపోతే కౌన్సిల్ రద్దు అయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దీంతో రేపటి సమావేశాలకు వైసిపి సభ్యులు

ఆరోగ్య పరీక్షలకు సంజీవిని పథకం అమలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ప్రజలకు ముందస్తు ఆరోగ్యపరీక్షలకు చేయడానికి త్వరలో రాష్ట్ర ప్రభుత్వం సంజీవిని పథకాన్ని తీసుకొస్తుందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు వెల్లడించారు. మంగళవారం మండలంలో రూ.2.62 కోట్లతో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన భూమి పూజ చేశారు. రూ.23 లక్షలతో స్థానిక పిహెచ్‌సిలో చేపట్టనున్న వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కోరంగి పంచాయతీ సీతారామపురం, బొడ్డు పెద వెంకటాయపాలెం, గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం, మల్లవరం పంచాయతీ పత్తిగొంది, గోవలంక పంచాయతీలలో నిర్మించే హెల్త్ క్లినిక్ లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేసిన నిర్మాణాలను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 11 హెల్త్ సెంటర్లను నిర్మాణం చేస్తున్నామని, ఇప్పటికే మధ్యలో ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, కూటమి నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, నడింపల్లి వినోద్, కోరంగి పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బాబి, పలువురు సర్పంచులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిసాల శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం ఎస్.రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. సర్కిల్ పరిధిలో ఎక్కడైనా కోడిపందాలు, గుండాట, పేకాట, బొమ్మ బొరుసు, ఎత్తులాట, కోత బంతి వంటి జూద క్రీడలు నిర్వహిస్తే 94949 33233, 9440796529, 9440796508 నంబర్లకు 100 112 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

దోచుకున్న సొత్తు రికవరీ

ప్రజాశక్తి - కడియం

వృద్ధురాలిని బెదిరించి చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి సొత్తును రికవరీ చేశామని కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మండలంలోని మాధవరాయుడుపాలెం శివారు చైతన్య నగర్‌కు చెందిన శాంతమ్మ అనే 67 ఏళ్ల వద్ధురాలు ఈ నెల 25న శ్రీకాకుళం నుంచి బయలు దేరి రాత్రికి రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో దిగింది. అక్కడ నుంచి చైతన్య నగర్ స్వగ్రామం చేరేందుకు వేచి ఉంది. ఈ సమయంలో ఒక వ్యక్తి లిఫ్ట్ పేరుతో బైక్ ఎక్కించుకున్నాడు. శాంతమ్మను ఇంటి దగ్గర దింపుతానని చెప్పి మార్గ మధ్యలో ఆమెను కత్తితో బెదిరించి చెవికున్న బంగారపు చెవి దిద్దులు, రూ.5వేల నగదు అపహరించి పారిపోయాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేశారు. నిందితుని పట్టుకుని సొత్తును రికవరీ చేశారు.

5న గ్రామ సభల నిర్వహణ

ప్రజాశక్తి - గండేపల్లి

గ్రామాల్లో పారిశుధ్య పనుల నిమిత్తం జనవరి 5న ప్రతీ గ్రామంలోనూ గ్రామ సభలు నిర్వహించాలని ఎంపిడిఒ కె.హరికృష్ణసత్యారెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 4వ తేదీ వరకూ గ్రామాల్లో పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులను చేపట్టాలని అన్నారు. అనంతరం 5వ తేదీన గ్రామ సభలు నిర్వహించి గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను ప్రజలకు వివరించాలన్నారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన గ్రామస్తులు సంక్రాంతికి వారి ఇంటికి వస్తారని, వారికి గ్రామంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ అధికారులు తరంగిణి, పోతుల శిరీష, ఫణీంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు చూపించాలంటూ వినతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

గత ప్రభుత్వ పాలనలో జగనన్న కాలనీలలో పట్టాలిచ్చి భూములు ఇవ్వలేదని, ఆ స్థలాలను చూపించాలని గాడిమొగ పంచాయితీ లక్ష్మీపతిపురం గ్రామానికి మహిళలు కోరారు. గ్రామంలో హెల్త్ క్లినిక్ నిర్మాణానికి భూమి పూజ చేయడానికి వచ్చిన ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును మహిళలు కలిసి మాట్లాడారు. ఎంతో ఆర్భాటంగా పట్టాలు ఇచ్చారని, కానీ స్థలాలు చూపించకపోవడం వల్ల అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ త్వరలోనే మూడు సెంట్లు ఇళ్ల స్థలం ప్రభుత్వం కేటాయించనుందని అన్నారు.

ఇవిఎంల గొడౌన్ పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

నగరంలోని ఎఫ్‌సిఐ గొడౌన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ కీర్తి చేకూరి, నోడల్ అధికారి, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎంల భద్రతపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఇవిఎంలపై నిరంతర సీసీ కెమెరాల ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహశీల్దార్ పిహెచ్‌జికె.పాపారావు, టిడిపి, బిజెపి పార్టీల నాయకులు, భద్రతా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదవులు అలంకార ప్రాయం కాకూడదు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఏ వ్యక్తికైనా పదవి అలంకారప్రాయం కాకూడదని పదవీకాలంలో సంఘ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రతి ఒక్కరికీ సేవలు అందించాలని ఎఎస్‌ఐ జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండల అధ్యక్షుడిగా సంఘం అధ్యక్షునిగా నియమితులైన అప్పన రాజుకు తాళ్లపూడి ప్రెస్ క్లబ్ మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో జోడాల పాల్గొని మాట్లాడారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు అప్పన రుక్మాంగదరావు, సత్యనారాయణ, బ్రహ్మానందం, చినబాబు, భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో మంగళవారం సర్వారాయ సుగర్స్ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ చట్టం-1986పై న్యాయ అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కాలుష్యం వల్ల కలిగే నష్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చట్టంలోని ముఖ్య నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా ప్రొటెక్ట్ టుడే సెక్యూర్ టుమారో పేరుతో ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. న్యాయ సమస్యలు ఎదురైతే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

బాలల భిక్షాటనపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - సామర్లకోట

ఐసిడిఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా భీమేశ్వర ఆలయ ప్రాంగణం, రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో భిక్షాటనలో ఉన్న బాలలు, వీధి బాలలను గుర్తించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, సోషల్ వర్కర్ చినబాబు, ఔట్రీచ్ వర్కర్ దుర్గాభవాని, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. డ్రైవ్‌లో భాగంగా భిక్షాటన చేస్తున్న ఆరుగురు బాలలను గుర్తించారు. వీరిలో నలుగురు బాలల కుటుంబాలు కలకత్తా నుంచి, ఇద్దరు బాలల కుటుంబాలు పలనాడు జిల్లా నుంచి వలస వచ్చి జీవనాధారంగా తల్లులతో కలిసి భిక్షాటన చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గుర్తించిన బాలలు, వారి తల్లులను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట పర్సువల్ కాల్ ద్వారా హాజరుపరిచారు. అనంతరం వారి నుంచి లిఖితపూర్వక అంగీకార పత్రాలు తీసుకుని, కమిటీ ఆదేశాల మేరకు పిల్లలను వారి తల్లులకు అప్పగించారు.

భిక్షాటనపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న బృందం

సర్పంచ్ రామకృష్ణకు బుజ్జగింపు

ప్రజాశక్తి - రౌతులపూడి

గత కొంతకాలంగా వైసిపిపై అలకబూని పార్టీకి దూరంగా ఉన్న సర్పంచ్‌కు పార్టీ నాయకత్వం బుజ్జగించేందుకు చర్యలు చేపట్టింది. మండలంలోని గుమ్మరేగుల గ్రామ సర్పంచ్ రామకృష్ణ పార్టీపై అలకబూని గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. గతంలో ఆయన పార్టీని వీడు తున్నట్లు సోషల్ మీడియాలో కొందరు హల్‌చల్ చేశారు. దీనిపై పార్టీ నియోజకవర్గ నాయకత్వం పట్టించుకోకపోవడంతో ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరం అయ్యారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు సూచన మేరకు మాజీ ఎంఎల్‌సి అంగూరు లక్ష్మీశివకుమారి మంగళవారం సర్పంచ్ రామకృష్ణ నివాసానికి వచ్చి కలుసుకున్నారు. ముద్రగడ గిరిబాబు సూచన మేరకు తాను రావడం జరిగిందని, పార్టీలో చిన్న చిన్న అభిప్రాయభేదాలు రావడం సహజమని, అటువంటి వాటిని చర్చలు, సంప్రదింపులతో పరిష్కరించు కోవాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా రాజ కీయాల్లో కొనసాగుతున్నానని, వైఎస్ఆర్, వైఎస్. జగన్మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానంతోనే పార్టీ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2029 ఎన్నికల్లో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు విజయానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ పులి మధు, ములగపూడి మాజీ సర్పంచ్ అంకంరెడ్డి సతీష్‌కుమార్, సర్పంచ్ మిరియాల చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యకర్త పురస్కారాల అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

పార్టీ కోసం అంకితభావంతో పని చేసే కార్యకర్తలకు ఉత్తమ కార్యకర్త పురస్కారాలను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. మంగళవారం మండలంలోని అచ్చంపేటలో ఉన్న ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సామర్లకోటకు చెందిన కంటే జగదీష్ మోహనరావు, అడబాల కుమారస్వామి, తాతపూడి సత్యఅరుణ్ వంశీ, వాడపర్తి వీరభద్రరావు, గుడాల శేఖర్, తాతపూడి కృష్ణబాబు, మహమ్మద్ సైఫుల్లా, సింగంపల్లి నరసింహ మూర్తి, మన్యం వీరమహేష్, నిడదవోలు వీర్రాజు, వెదుళ్ల వీరబాబు, సానిపిని సుజాత, సంపూంగి దుర్గారావు, మల్లిరెడ్డి వంశీకృష్ణ, దువ్వ సత్యనారాయణలకు ఉత్తమ కార్యకర్త పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, సామర్లకోట పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, మునిరెడ్డి శ్రీరాములు, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీనుబాబు, నాయకులు నూనె రామారావు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యకర్త పురస్కారాన్ని అందిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

సతీష్‌రెడ్డికి ఎడ్యుకేషన్ ఛేంజ్ మేకర్ అవార్డు

ప్రజాశక్తి - గండేపల్లి

ఐసిటి అకాడమీ సంస్థ మంగళవారం విజయవాడలో నిర్వహించిన అకాడమీ బ్రిడ్జ్ కాన్ఫరెన్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన ఎడ్యుకేషన్ ఛేంజ్ మేకర్ అవార్డు ను ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి అందు కున్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఎడ్యుకేషన్ ఛేంజ్ మేకర్ అవార్డును అందుకున్న డాక్టర్ సతీష్‌రెడ్డికి ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్, ఆదిత్య యూనివర్సిటీ విసి డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉన్నత విద్యలో అసాధారణ నాయకత్వాన్ని, విద్యా నైపుణ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆదిత్య అనుసరిస్తున్న ప్రభావం తమైన ప్రయత్నాలను ఐసిటి అకాడమీ బోర్డు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందజేసిందన్నారు. ఈ అవార్డుతో మరిన్ని సంస్కరణలతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రో ఎంవి.శ్రీనివాస్, ప్రో. వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్లు డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ రవి తంగవేల్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

అవార్డును అందుకుంటున్న ఆదిత్య ప్రొ ఛాన్సలర్ సతీష్‌రెడ్డి

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

అంతర్ జిల్లాల మహిళల కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుకు స్పోర్ట్స్ కిట్లను మంగళవారం ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సోషల్ మీడియా చైర్మన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ట్రెజరర్ నిమ్మకాయల కిరణ్‌కుమార్, అంతర్జాతీయ క్రీడాకారిణి నిమ్మకాయల శ్వేత స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం గ్రామంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల మహిళ కబడ్డీ పోటీలకు ఈ క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు అవసరమని వారు అన్నారు. అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు ఉన్నతంగా రాణించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కొండపల్లి శ్రీను వారిని అభినందించారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు పని చేయాలని ఎంపిపి చలగళ్ల దొరబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లేపల్లి ఎంపిటిసి బత్తుల వరలక్ష్మి మాట్లాడుతూ తన పొలం సమస్యపై తహశీల్దార్ కార్యాలయంలో ఎన్ని ధ్రువపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల పరిషత్ బడ్జెట్ ను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు కుంచే రాజా, బీరా వెంకటలక్ష్మి, ఎంపిడిఒ కె.హరికృష్ణసత్యారెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంఇఒ కె.హెచ్.నాయక్, విద్యుత్ శాఖ ఎఇ కెరటాశేఖర్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటలక్ష్మి, పశు వైద్యాధికారి శ్రీనివాస్, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

రంగనాగ్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు

నిమ్మకాయల రంగనాగ్‌కు జనసేన నాయకుల అభినందన

ప్రజాశక్తి - సామర్లకోట

టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన నిమ్మకాయల రంగనాగ్‌కు జనసేన నాయకులు అభినందనలు తెలిపారు. అచ్చంపేట గ్రామంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సరోజ వాసు, పిట్టా జానకిరామారావు, తమ్మల ప్రసాద్, అత్తిలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆలయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం, గొల్లప్రోలు

పెద్దాపురంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ వద్ద విష్ణు భక్త మండలి ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి జగదీశ్వరరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ జల్లూరి వీర్రాజు, విష్ణు భక్త మండలి అధ్యక్షుడు రావులపర్తి విజయ్, సభ్యులు, ధర్మకర్తలు పాల్గొన్నారు. అలాగే తిరుపతిలోని శృంగార వల్లభ స్వామిని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు వారికి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ మొయిళ్ల సంధ్య, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు వేకువజామున తీర్థపు బిందెతో స్వామివారి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నగర పంచాయతీ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం ఛైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన బుధవారం జరుగుతుందని కమిషనర్ పి.శ్రీనివాస్ మంగళ వారం తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు హాజరుకావాలని కమిషనర్ కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ప్రతి నెల ఒకటో తేదీని పంపిణీ చేసే సామాజిక పింఛన్లను ఒకరోజు ముందుగానే బుధవారం పంపిణీ చేయనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ పి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో 2836 మందికి, మండలంలో 7582 మందికి ఉదయం 6:30 గంటల నుంచి పంపిణీ చేస్తామని ఎంపిడిఒ సెలెక్ట్ రాజు తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని న్యాయవాది కెవిఎల్.గణేష్ సూచించారు. మంగళవారం స్థానిక ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. పిఎల్‌వి సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సదస్సులో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని ఎసిసి కాలనీలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మోజెస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ క్రిస్మస్ వేడుకలో భారీ క్రిస్మస్ కేక్ ను కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో పాస్టర్ పి.దానియేలు, రాగం పాదాలు, పల్లి ప్రభుదేవా, ఏలేటి నానిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షనా కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

సమస్యల పరిష్కారంపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - సామర్లకోట

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై గ్రామ స్థాయి అధికారులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పలు మార్గదర్శకాలను తహశీల్దార్ అవగాహన కల్పించారు. జాయింట్ ఎల్‌పిఎంలను సబ్ డివిజన్ చేయడం, భూవిస్తీర్ణ వ్యత్యాసాలను సరిచేయడం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల సమయంలో ఆటో మ్యుటేషన్ల విధానంలో జరుగుతున్న పొరపాట్లను సరిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణకు సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహశీల్దార్ కె.పద్మజ, రీ సర్వే డిటి యడ్ల శ్రీనివాస్, విఆర్‌ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కల్వరి మిరాకిల్ చర్చిలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ లంక పురుషోత్తమ దాస్, మేరీ రాజకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాన్ మోజెస్‌దాస్, బ్లెస్సింగ్, డాక్టర్ విజయలక్ష్మి, వంశీ, సుకుమార్, డాక్టర్ వెంకటభార్గవ్, చందు స్టీఫెన్, విక్టర్ ప్రేమసాగర్, జైరాజు, కె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు. బాలలు ప్రదర్శించిన నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

పిడిపి 500 వస్త్రాల పంపిణీ దశ్యం

'ప్రజలకు అందుబాటులో ఉంటా'

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నూతన సంవత్సర వేడుకలకు కిర్లంపూడిలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని గ్రామాల్లో ఫ్లెక్సీలను ప్రభుత్వ స్థలాల్లో పెట్టవద్దని, ఎక్కడ వివాదాలకు తావివ్వకుండా శాంతియుతంగా నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు.

ముద్రగడ గిరిబాబు

యానాం వార్తలు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న ఆర్ఎఒ అంకిత్‌కుమార్

ఓటర్ల జాబితాపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం పరిపాలనాధికారి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ అంకిత్‌కుమార్ పాల్గొని మాట్లాడాదరు. జనవరి 11 వరకు సంబంధిత బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లతో నాన్ మ్యాప్డ్ క్యాటగిరికి సంబంధించిన ఓటర్ల కోసం ప్రత్యేక విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ వృద్ధాప్య ఓటర్ల కొరకు వారి నివాసంలోనే విచారణ చేపడతామన్నారు. ఇటీవల డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో భాగంగా చనిపోయిన, ఇతర ప్రదేశానికి మార్పు, నివాస ప్రదేశంలో లేకపోవడం తదితర కారణాలతో రూపొందించిన ఎఎస్‌డి జాబితా నుంచి 3011 మందిని తొలగించామన్నారు. ఓటర్ల కోసం ఆయా పోలింగ్ స్టేషన్లో, ఓటరు జాబితాను www.yanam.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వివరించారు. గణన ఫారములు సమర్పించని ఎఎస్‌డి ఓటర్లు, క్లెయిముల అభ్యంతరాలు ఉంటే జనవరి 15 లోపు అందజేయాలన్నారు. నూతన ఓటు కొరకు ఫారం- 6 ను తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు పూర్తి సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మంచాల సత్యసాయి కుమార్, అర్దాని దినేష్, కనకాల రాజు, భాష, అధికారులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం విజ్ఞాన్ కేంద్రం వద్ద విద్యార్థులు

యానాం విద్యార్థినుల విహార యాత్ర

ప్రజాశక్తి - యానాం

స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మిషన్ శక్తి ఆధ్వర్యంలో విద్యా ఎక్స్పోజర్ టూర్‌కు 100 మంది యానాం విద్యార్థినులు మంగళవారం పయనం అయ్యారు. రాజమహేంద్రవరంలోని విజ్ఞాన కేంద్రం, కడియంలోని పల్లా వెంకన్న నర్సరీలను వారు సందర్శించారు. ఈ యాత్రను ఆర్ఎఒ అంకిత్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి సూరంపూడి రాజేంద్ర, మిషన్ శక్తి కోఆర్డినేటర్ రిపిక, ఆరోగ్య నిపుణులు, పోలీస్ సిబ్బంది, మిషన్ శక్తి సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామన్నకోడులో నగర సంకీర్తన

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు రామన్నకోడు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున నగర సంకీర్తన నిర్వహించారు. గ్రామ ప్రజలు తెల్లవారుజామున ఐదు గంటలకు ప్రధాన రహదారుల్లో భజనలు చేశారు. ధనుర్మాస ప్రారంభం నుంచి నెల రోజులపాటు ప్రతిరోజు నగర సంకీర్తన నిర్వహిస్తామని మహిళలు తెలిపారు.

రెవెన్యూ రికార్డులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామ రెవెన్యూ రికార్డుల పట్ల విఆర్‌ఒలు, సర్వేయర్లకు పూర్తి అవగాహన అవసరమని ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాళ్లరేవు, కాజులూరు, కాకినాడ అర్బన్ మండలాలకు చెందిన విఆర్‌ఒలు, సర్వేయర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఇటీవల చేసిన రీసర్వే వల్ల పూర్తిగా సమస్యలు పరిష్కారం కాలేదని, మరికొన్ని కొత్త సమస్యలు వచ్చాయని అన్నారు. వాటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించి ముందుకు వెళ్లాలని సూచించారు. భూములకు సంబంధించిన ఏ విచారణ అయినా చట్టాన్ని పొందుపరుస్తూ ముందస్తు నోటీసు ఇవ్వాలని అన్నారు. సిబ్బంది అంతా సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని అవగాహనతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.త్రినాథరావు, డిటి సూరిబాబు, ఆర్ఐ జి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నిడదవోలు మండలం, అట్లపాడు గ్రామం, డోర్.నెం.3-145, కాపురస్తులు, సురేష్‌బాబు పుచ్చకాయల, తండ్రి: వెంకటేశ్వరరావు, అను నాయొక్క ఒరిజినల్ దస్తావేజులు నెం.3751/2019, 7026/2016 గల డాక్యుమెంట్స్ ది. 20-11-2025 తేదీన జిరాక్స్ తీయించుకొను నిమిత్తం వెళ్ళుచుండగా సమిశ్రగూడెం చెఱువుగట్టు పరిశర ప్రాంతాలలో పోయినవి. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

సురేష్‌బాబు పుచ్చకాయల, తండ్రి : వెంకటేశ్వరరావు
సెల్ : 9642421404

పాస్ పోర్టు పడిపోయినది

డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం శివారు పోతాయిలంక తాటికాయల చెరువుకు చెందిన నివసముంటున్నాను. ది. 15-12-2025 తేదిన నేను పాస్‌పోర్టు నెం.PSP23983 ను జిరాక్స్ తీయించుకొనేందుకు అంబాజీపేట సెంటర్ కు వెళుతుండగా దారిలో పడిపోయినది. దయచేసి నాపాస్ పోర్టు దొరికినవారు ఈ క్రింది అడ్రస్ కు పంపకోరుచున్నాను.

కుసుమే సుగుణ
D/o.సుందరరావు.
మాచవరం శివారు పోతాయిలంక,
అంబాజీపేట మండలం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా.
సెల్: 9949377971

ప్రకటన

సున్నం జయలక్ష్మి భర్త శ్రీనివాసరావు, డోర్‌నెం.18-21-4, శ్రీకృష్ణనగర్, రాజమండ్రి, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నేను ఇందుమూలంగా తెలియజేయునది. తూ॥గో॥జిల్లా పిఠాపురం మండలం సింహాద్రిపురం డోర్‌నెం.4-50B కాపురస్తులు అయిన గోపు నూకరాజు గారి కుమారుడు గోపు సూర్యరావు గారికి నాపేరున గల ACCESS125, AP05CX 0595 నెంబరు గల స్కూటర్‌ను OLX ద్వారా అమ్మగా నాకు అడ్వాన్స్ ఇచ్చి 15-11-2024వ తేదిన స్కూటర్‌ను తీసుకొని వెళ్ళియున్నారు. అప్పటినుండి ఇప్పటి వరకు రిజిష్ట్రేషన్ చేయించుకోమని ఎంత అడిగినను వారి పేరున చేయించుకోవడంలేదు. మరియు నాకు ఇవ్వవలసిన డబ్బు కూడా ఇవ్వడం లేదు సదరు స్కూటర్‌పై ఏవిధమైన లావాదేవీలు చేసిన నేను తీసుకొను సివిల్ క్రిమినల్ కేసులకు బాధ్యులుగుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

సున్నం జయలక్ష్మి
భర్త సున్నం శ్రీనివాసరావు
9441426044